ప్రజాశక్తి
గురువారం 9 నవంబర్ 2023
5
పార్వతీపురం మన్యం

నేటి నుంచి రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు

ప్రజాశక్తి-పార్వతీపురం

67వ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు జిల్లాలో ఈ నెల 9వ తేదీ నుండి 11వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షులు, జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 14, 17, 19 సంవత్సరాలలోపు బాలురు, బాలికల విభాగాల్లో కరాటే పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీతానగరం మండలం జోగింపేట బి.ఆర్.అంబేద్కర్ గురుకులంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పార్వతీపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, విద్యార్థులు

పార్వతీపురం మన్యం జిల్లాలో విద్యార్థి, యువజన సంఘాలు చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, కడప ఉక్కు కర్మాగారం నిర్మాణం చేపట్టాలని కోరుతూ బుధవారం ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ పిలుపుమేరకు చేపట్టిన బంద్‌లో కెజి టు పిజి వరకు విద్యాసంస్థలన్నీ మూతపడ్డాయి. ప్రయివేటు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ ప్రకటించాయి. బంద్ సందర్భంగా విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమానికి మద్దతుగా పార్వతీపురం, పాలకొండ పట్టణాల్లో విద్యార్థులు భారీ ర్యాలీలు చేపట్టారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

- ఉక్కు పోరాటానికి విద్యార్థుల నుంచి సంపూర్ణ మద్దతు
- స్వచ్ఛందంగా బంద్ పాటించిన ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు

ప్రజాశక్తి-కలెక్టరేట్

బంద్ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు.. కాలేజీ నుంచి కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.రాజు, హెచ్.సింహాచలం, పిడిఎస్ఒ జిల్లా ఉపాధ్యక్షులు కె.సోమేష్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు పోరాటం బుధవారంతో వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. 32 మంది ప్రాణత్యాగంతో ఏర్పాటైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నిందని విమర్శించారు. బిజెపి విధానం రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేయడమేనన్నారు. రాష్ట్రానికే వెన్నెముకగా నిలిచిన ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరణ చేయాలన్న నిర్ణయాన్ని బిజెపి ప్రభుత్వం ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, సురేష్, మాధవ, సోమేష్, ప్రకాశ్, సూర్య, సురేంద్ర, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

కురుపాం.. ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

కురుపాం : విద్యాసంస్థల బంద్ కురుపాం మండలంలో సంపూర్ణమైంది. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రాజు ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. శోభలతాదేవి కాలనీ వరకు ర్యాలీ నిర్వహించి తెరిచి ఉన్న పాఠశాలలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మూసివేయించారు. విద్యార్థులను ఇళ్లకు పంపించారు.

పాలకొండ : పాలకొండ పట్టణంతోపాటు మండలంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. బంద్ సందర్భంగా పాలకొండలో పలు కళాశాలల విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.పండు మాట్లాడుతూ లక్షల మందికి ఉపాధి కల్పిస్తూ విశాఖపట్నం అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన స్టీల్ ప్లాంట్‌ను చవకగా కార్పొరేట్లకు కట్టబెట్టే కేంద్రంలోని మోడీ ప్రభుత్వ కుట్రలను ప్రజలంతా వ్యతిరేకించాలని కోరారు. ఉక్కు కార్మిక సంఘాలు వెయ్యి రోజులుగా దీక్షలు చేపడుతున్నా ప్రధాని మోడీ స్పందించక పోవడం చాలా దుర్మార్గమన్నారు. ఎన్నికలలో కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్న హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సూర్య, అనిల్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన పాఠశాల

సాలూరు : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిర్వహించిన బంద్ విజయవంతమైంది. పట్టణంలో, మండలంలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలను మూసివేశారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు అఖిల్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ నిలిపివేయాలని, కడప ఉక్కు కర్మాగారం నిర్మించాలని, ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సుబ్బరావమ్మ

15న చలో విజయవాడ

విజయవంతం చేయాలి : సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-కలెక్టరేట్

అసమానతలు లేని రాష్ట్ర అభివృద్ధితోపాటు రాష్ట్ర, మన్యం జిల్లా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేపడుతున్న ప్రజా రక్షణభేరిలో భాగంగా ఈ నెల 15న విజయవాడలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సుబ్బరావమ్మ తెలిపారు. బుధవారం పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో, జిల్లాలో కరువు తీవ్ర స్థాయిలో ఉందన్నారు. తీవ్ర వర్షాభావం ఉన్న కురుపాం, పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం మండలాలను కరువు ప్రాంతంగా ప్రకటించి, కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ ప్రాంతాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలని కోరారు. విద్య, వైద్య, రోడ్డు సౌకర్యాలు మెరుగుపరచాలని, పార్వతీపురం, గిరిజన ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించాలన్నారు. పూర్ణపాడు-లాభేసు వంతెన పోరాట సందర్భంగా పనులు ప్రారంభిస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం విలువలు, లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని సమగ్ర అభివృద్ధి కోసం, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా ద్రోహం చేసిన బిజెపి విధానాల్ని తిప్పికొట్టాలని సిపిఎం ప్రజా రక్షణ బేరి యాత్రలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 15న చలో విజయవాడ కార్యక్రమంలో భాగంగా జరిగే బహిరంగ సభకు జిల్లా ప్రజలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ జిల్లాలో కరువు ప్రభావం అంచనాను గ్రామాల ప్రాతిపదికన సత్వరంగా చేపట్టాలని, రైతులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొల్లి గంగునాయుడు, కోలక అవినాష్, జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ పాల్గొన్నారు.

బస్సుయాత్రకు తరలిరావాలి

ఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఈ నెల పదో తేదిన పార్వతీపురం పట్టణంలో జరిగే సామాజిక సాధికార బస్సుయాత్రకు ప్రజలు తరలిరావాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. బుధవారం పట్టణంలో కొత్తవలస పరిధిలోని 5, 6, 7, 8, 9 వార్డుల్లోని వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కో-ఆప్షన్ కౌన్సిలర్ మెరువ వెంకట్రావు నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో కలెక్టర్ భార్య ప్రసవం

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ సతీమణి కరుణ పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో బుధవారం సాయంత్రం పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.వాగ్దేవి, ఆమె బృందం సురక్షితంగా ప్రసవం కావడానికి అన్ని చర్యలు తీసుకున్నారు. కరుణకు ఇది రెండో కాన్పు. మొదటి కాన్పు కూడా రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగి ఆడపిల్లకు జన్మనిచ్చారు. అప్పుడు నిశాంత్ కుమార్ రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిగా పనిచేశారు.

ప్రసవం అనంతరం బిడ్డతో కలిసి ఇంటికి వస్తున్న కలెక్టర్ దంపతులు



పార్వతీపురం కోర్టు వద్ద పోరాట కమిటీ నాయకులు, గిరిజనులు

బోడికొండ పోరాట నాయకులపై

కేసు కొట్టివేత

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

బోడికొండపై గ్రానైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన పోరాట కమిటీ నాయకులపై పెట్టిన కేసును న్యాయస్థానం బుధవారం కొట్టివేసింది. పార్వతీపురం మండలంలోని బొడ్డవలస పంచాయతీలో బోడికొండపై అక్రమ గ్రానైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా 2016 నుంచి పోరాట కమిటీ ఆధ్వర్యాన అనేక రూపాల్లో ఆందోళనలు సాగాయి. కంపెనీ యాజమాన్యం, పార్వతీపురం రూరల్ పోలీసులు, అధికారులు కలిసి 2018లో పోరాట కమిటీ నాయకులు, గిరిజనులు 31 మందిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును బుధవారం న్యాయ స్థానం కొట్టివేసింది. పోరాట కమిటీ నాయకుల తరుపున న్యాయవాదులు శాంతిరాజు మన్మథరావు, కృష్ణ వాదనలు వినిపించారు. ఈ ఉద్యమంలో కీర్తిశేషులు, సిపిఎం జిల్లా పూర్వ కార్యదర్శి రెడ్డి శ్రీరామ్మూర్తి కీలకపాత్ర పోషించారు. ఈ కేసులో ఎ1గా టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ఉన్నారు. వీరితోపాటు అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు పోలా ఈశ్వరరావు, పాలక రంజిత్ కుమార్, వెలగాడ కృష్ణ, పోలా రమణి తదితరులను నిందితులుగా చేర్చారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు పాలక రంజిత్ కుమార్, పోలా రమణి, వెలగాడ కృష్ణ తదితరులు మాట్లాడుతూ గిరిజనుల పక్షాన పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టంచేశారు. అడవుల నుంచి గిరిజనులను తరిమేయాలనే ఆలోచనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలని డిమాండ్ చేశారు.

బడుగుల జీవితాల్లో వెలుగులు

సామాజిక సాధికార బస్సుయాత్రలో మంత్రులు ధర్మాన, రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

రాష్ట్రంలోని బడుగుల జీవితాల్లో వెలుగులు నింపిన ప్రభుత్వం తమదేనని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. వైసిపి సామాజిక సాధికార బస్సు యాత్ర బుధవారం సాలూరు పట్టణానికి చేరుకుంది. అందులో భాగంగా బుధవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై డిప్యూటీ సిఎం రాజన్నదొర అధ్యక్షతన నిర్వహించిన సభలో ధర్మాన ప్రసాదరావు మాట్లాడారు. టిడిపి ప్రభుత్వ హయాంలో పేదలు సంక్షేమ పథకాల కోసం అనేక అవమానాలు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. టిడిపి కార్యకర్తలు, సానుభూతి పరులైతే గాని సంక్షేమ పథకాలు అందని పరిస్థితి ఉండేదన్నారు. అలాంటి పరిస్థితి నుంచి గడిచిన నాలుగున్నర ఏళ్లలో రాష్ట్ర ప్రజల జీవితాల్లో గొప్ప మార్పు వచ్చిందని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో సంక్షేమ పథకాల గురించి హేళన చేస్తూ ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు మాట్లాడారని చెప్పారు. పేదలకు పప్పు బెల్లం డబ్బులు పెంచుతున్నారని చంద్రబాబు విమర్శించారని చెప్పారు. తర్వాత మాట మార్చి వైసిపి కంటే మెరుగైన పథకాలు తాను అధికారంలోకి వస్తే ఇస్తానని చెప్పారని గుర్తుచేశారు. 14 ఏళ్లపాటు సిఎంగా పనిచేసిన చంద్రబాబు ఈ పథకాలను అమలు చేస్తే టిడిపిని ప్రజలు ఎందుకు ఓడిస్తారని చెప్పారు. మోసపూరిత హామీలిచ్చి మూడుసార్లు టిడిపి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తామని చెప్పి చేతులెత్తేసిన ఘనత చంద్రబాబుదేనని చెప్పారు. అలాంటి చంద్రబాబుకి మరో ఛాన్స్ ఇస్తే మేలు చేస్తారని గ్యారెంటీ ఏముందని ప్రశ్నించారు.

సభలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ ఎస్‌సిలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అని ఎగతాళి చేసిన చంద్రబాబు.. గిరిజన, దళిత వ్యతిరేకి అన్నారు. టిడిపి, జనసేనతోపాటు ఎన్ని పార్టీలు కలిసి పోటీ చేసినా రానున్న ఎన్నికల్లో ప్రజలు ఓడిస్తారని చెప్పారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు రూ.1060 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. టిడిపి హయాంలో గిరిజనులకు మంత్రి పదవి ఇవ్వలేదని చెప్పారు. దళిత, గిరిజనులంటే చంద్రబాబుకి చిన్నచూపు అన్నారు.

అనంతరం ఎంపి జి.మాధవి, రాజాం ఎమ్మెల్యే జోగులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు జోగారావు, శంబంగి వెంకట చినప్పలనాయుడు, పుష్పశ్రీవాణి, కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైసిపి మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్ రాజు, జిసిసి చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు

రైతు సమస్యలపై

10న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-సీతానగరం

ఈ నెల పదో తేదిన కలెక్టరేట్ వద్ద చేపట్టే రైతుల ధర్నాను విజయవంతం చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు తెలిపారు. ఈ మేరకు ధర్నాను విజయవంతం చేయాలని మండలంలోని ఏగోటి వలస, గాదెలవలస, జానుములవలస, లక్ష్మీపురం, బూర్జ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ సర్వేలో చాలా తప్పులున్నాయని తెలిపారు. రెవెన్యూ అధికారులు, సంబంధిత సర్వే సిబ్బంది మొక్కుబడి చేపట్టిన సర్వేలో వాస్తవ సాగుదారు ఒకరైతే, పట్టాదార్ పాస్ పుస్తకాల్లో వేరే వారి పేర్లు నమోదు చేశారని తెలిపారు. భవిష్యత్తులో రైతులు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. తక్షణమే రీసర్వే చేసి తప్పులు సరిదిద్దాలని డిమాండ్ చేశారు. వర్షాలు లేక జిల్లాలో వరి చాలావరకు ఎండిపోయిందని, ప్రభుత్వం ఇంతవరకు కరువు ప్రాంతాలను ప్రకటించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కరువు ప్రకటించకపోతే రైతులకు నష్ట పరిహారం రాదని ఆందోళన వ్యక్తంచేశారు. తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్‌సిఎస్ చక్కెర ఫ్యాక్టరీ మూత పడిన కారణంగా ఈ ప్రాంత రైతులు పండించిన చెరకు పంటను సంకిలి కర్మాగారానికి తరలిస్తున్నారని తెలిపారు. అలాంటి రైతులకు రవాణా ఛార్జీలు కర్మాగార యాజమాన్యం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం మండల నాయకులు బి.అప్పారావు, జి.వెంకటరమణ పాల్గొన్నారు.

మన్నించండి.. ముగ్గురినీ ఉంచుతాం

ఉపాధ్యాయుల డెప్యుటేషన్‌పై వెనక్కి తగ్గిన ఎంఇఒ

ప్రజాశక్తి-సాలూరురూరల్

'మీ మనస్సు నొప్పించి ఉంటే మన్నించండి. మీ పాఠశాలకు మంజూరైన ముగ్గురు ఉపాధ్యాయులను అక్కడే ఉంచుతాం' అని ఎంఇఒ రాజ్‌కుమార్.. విద్యార్థుల తల్లిదండ్రులను క్షమాపణ కోరారు. మండలంలో గంగన్నదొరవలస చెందిన పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు మూడు రోజుల క్రితం సాలూరు ఎంఇఒ రాజ్‌కుమార్‌కు తమ గ్రామంలోని పాఠశాల, ఉపాధ్యాయుల సమస్యలను వివరించడానికి వెళ్లారు. ఆయన విద్యార్థుల తల్లిదండ్రులతో దురుసుగా ప్రవర్తించారు. దీంతో తల్లిదండ్రులు మనస్తాపానికి గురై బుధవారం పాఠశాలకు ఏ విద్యార్థినీ పంపించలేదు. ఈ విషయాన్ని అక్కడి ఉపాధ్యాయులు ఎంఇఒ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన గంగన్నదొరవలస పాఠశాలకు చేరుకుని, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కావాలనే ఎవరినీ కించ పరచలేదని, అందుకు తనను మన్నించాలని కోరారు. గ్రామంలో 42 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి ఇద్దరు ఉపాధ్యాయులుంటే సరిపోతుందన్న ఉద్దేశంతోనే ఇంకొక ఉపాధ్యాయుడిని పక్కనున్న దండిగాం పాఠశాలకు డెప్యుటేషన్‌పై పంపించామని తెలిపారు. ఇక్కడున్న పిల్లలకు మూడు ఇళ్లల్లోని వరండాలలో పాఠాలు చెబుతున్నారని, ఇక్కడి పరిస్థితుల దృష్ట్యా ముగ్గురు ఉపాధ్యాయుల అవసరం ఉందని అర్థమైందని చెప్పారు. మూడో ఉపాధ్యాయుడిని కూడా ఇక్కడి పాఠశాలలోనే ఉంచేందుకు నిర్ణయించామన్నారు. మీ పాఠశాల పూర్తయ్యే వరకు ఉంటారని, వీరిని ఎక్కడికి తరలించబోమని హామీ ఇచ్చారు. దీంతో సంతృప్తి చెందని తల్లిదండ్రులు పాఠశాల నిర్మాణం విషయాన్ని ప్రశ్నించారు. ఇళ్లల్లో గడపలలో విద్యార్థులను కూర్చోబెట్టి ఎన్నాళ్లు పాఠాలు చెబుతారని, తరగతి గదులు ఎప్పటికి పూర్తవుతాయని ఎంఇఒను ప్రశ్నించారు. పాఠశాలకు నిధులు ప్రస్తుతం లేవని, వచ్చిన వెంటనే పనులు మొదలు పెడతామని తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక మంత్రికి దృష్టికి తీసుకెళ్లాలని గ్రామస్తులకు ఆయన సూచించారు.

విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఇఒ రాజ్‌కుమార్

వలస వచ్చిన వారితో మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహనరావు

చిన్నారులందరికీ పూర్తిగా టీకాలు

డిఐఒ జగన్మోహనరావు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రతి చిన్నారికీ టీకా పూర్తి చేయడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు ఆయన పట్టణ శివార్లలో నవిరికాలనీ వద్ద తాత్కాలిక జీవనం సాగిస్తున్న వలస కార్మికులుండే ప్రాంతాన్ని వైద్య సిబ్బందితో బుధవారం సందర్శించారు. అక్కడ పిల్లలకు, గర్భిణులకు టీకాలు ఏమేరకు వేశారో తనిఖీ చేశారు. పిల్లల తల్లిదండ్రులతో ఆయన మాట్లాడి, వారి వయస్సు బట్టి టీకా ఏమేరకు పూర్తి అయ్యిందీ, ఇటీవల వచ్చిన నిర్వాసితులు, వారిలో ఐదేళ్లలోపు పిల్లలు, గర్భిణులు ఎవరైనా ఉన్నారా? అని ఆరా తీశారు. పిల్లల టీకా వివరాలు రికార్డులో నమోదు చేసి గడువు తేదీలకు అనుగుణంగా టీకా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఐరన్ ఫోలిక్ యాసిడ్ సిరప్‌ను పిల్లలకు క్రమం తప్పకుండా వేయించాలన్నారు. అవసరమైన మందులు వారికి అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది శాంతి కుమారి, శ్రావణి సంధ్య, ఆశా కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

టీకాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పిల్లలకు వ్యాధినిరోధక టీకాల ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన పెంచాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని ఉల్లిభద్రలో వెల్నెస్ కేంద్రంలో టీకా కార్యక్రమాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాక్సిన్, అత్యవసర మందుల కిట్‌ను పరిశీలించారు. బుధవారానికి టీకా అర్హులైన పిల్లలు, గర్భిణులు ఎంత మంది ఉన్నారు, ఎంత మందికి వేస్తున్నారు, గడువు తేదీలను రికార్డులో పరిశీలించారు. ముందు రోజునే టీకా అర్హులకు తప్పకుండా సమాచారం ఇవ్వాలన్నారు. వైద్య సిబ్బంది టీకా వేస్తున్న తీరును ఆయన పరిశీలించారు. ఏ టీకా ఏయే వ్యాధులు రాకుండా వేస్తున్నారనేది తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. ఏ కారణాలతోనైనా టీకా వేయని పిల్లలు ఉంటే గుర్తించి వెంటనే పూర్తి చేయాలన్నారు. వివరాలన్నీ యూవిన్, ఆర్‌సిహెచ్ పోర్టల్స్‌లో నమోదు చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ జయగౌడ్, ఎఎన్ఎం ఈశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటిడిఎ ఎపిఒ రోసి రెడ్డి

విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలి

ఎపిఒ రోసిరెడ్డి

ప్రజాశక్తి-సీతంపేట

దోనుబాయి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను ఐటిడిఎ ఎపిఒ వై.రోసిరెడ్డి బుధవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ ఆఫీసర్‌గా పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించి, మరింత మెరుగుపరచాలని సూచించారు. విద్యార్థులకు పెట్టే భోజనాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారమే భోజనాలు పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.సుబ్బారావు, ఆర్ సి రెడ్డి, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పవర్ స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్న ఎంపిపి వెంకటరమణ నాయుడు

రాయితీపై పవర్ స్ప్రేయర్లు

ప్రజాశక్తి-వీరఘట్టం

స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయ ఆవరణలో బుధవారం ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు రాయితీపై పవర్ స్ప్రేయర్లను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రూ.20 వేలు విలువైన స్ప్రేయర్లను రూ.8 వేల సబ్సిడీతో అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వై.వెంకటరమణ, ఎపిఎం బి.శివున్నాయుడు, రైతు ఉత్పత్తిదారుల సంఘం సిసి వై.ఆనంద్, అధ్యక్షులు చింత ముకుందరావు, ఉద్యాన శాఖ ఎఒ టి.అమరేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 13 నుంచి ఆడుదాం ఆంధ్రా

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

డిసెంబర్ 13 నుంచి జనవరి 15 వరకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం చేపడుతున్నట్లు ఎంపిడిఒ సాల్మన్‌రాజ్ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ చంద్రశేఖర్, ఎస్ఐ షణ్ముఖరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ గీతాంజలి

రక్తహీనతను అధిగమించడానికి కృషి

ప్రజాశక్తి-సీతంపేట

ఏజెన్సీలో పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను నివారించడానికి అందరూ కృషి చేయాలని ఎంపిడిఒ కె.గీతాంజలి కోరారు. సీతంపేట మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారం అందించి రక్తహీనత నివారించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యాధికారులు సాయిచరణ్, రవీంద్ర మాట్లాడుతూ మూఢనమ్మకాలు పాటించకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. చిన్న సమస్య వచ్చినా ఆరోగ్యపరంగా ఆశాకి తెలియజేయాలని సూచించారు. అనంతరం టెలివిజన్ వీడియో ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఎపిఎం విజయ్ కుమారి, సిడిపిఒ రంగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు

అగ్ని ప్రమాదాల పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థులు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక శాఖ ఎస్ఐ ఆర్.బాబు అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌టి మౌంట్‌ఫోర్ట్ పాఠశాలలో విద్యార్థులకు అగ్నిమాపక పరికరాలు, ప్రమాదాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ సిబ్బంది రవి, రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల కేంద్రంలోని బిసి కాలనీలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతి కుమారి, ఎంఎల్‌హెచ్‌పి భాగ్యరాధ, ఎఎన్ఎం ఉష, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం పేదలకు వరం లాంటిదని పెద్దబుడ్డిడి సర్పంచి శీమల సుజాత అన్నారు. జియ్యమ్మవలస మండలం పెద్దబుడ్డిడిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనారోగ్యంతో బాధపడుతూ దూర ప్రాంతం వెళ్లలేని రోగులకు స్థానికంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటున్నాయని ఆమె అన్నారు. వైద్య శిబిరానికి రావివలస, గరుగుబిల్లి పిహెచ్‌సిల వైద్యులు వచ్చి సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రేవళ్ల జ్యోతి, వైస్ సర్పంచ్ తిరుపతి, వైసిపి నాయకులు శీమల బాబు, భువన మోహన్ రావు, శ్రీనివాసరావు, నారాయణరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఎఎంసి గోడౌన్లు

- లక్షలాది రూపాయలు నీటిపాలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-వీరఘట్టం

స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాములు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఆరున్నర ఎకరాల విస్తీర్ణంలో మార్కెట్ యార్డు స్థలంలో రెండు గోదాములతోపాటు రెండు విశాలమైన రేకుల షెడ్లను రెండు దశాబ్దాల కిందట లక్షలాది రూపాయలతో నిర్మించారు. రైతులు పండించిన పంటను ఆరబెట్టుకోవడంతోపాటు గిట్టుబాటు ధర వచ్చేంత వరకు నిల్వ ఉంచుకునేందుకు వీలుగా అప్పట్లో వీటిని ఎఎంసి అధికారులు నిర్మించారు. ఇవి మూణ్నాళ్ల ముచ్చటగా పనిచేసి మూలకు చేరాయి. దీంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

శిక్షణలకు వినియోగం

2008-09 ఆర్థిక సంవత్సరంలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మార్కెట్ యార్డు గోడౌన్లో ఎలక్ట్రికల్, తాపీ మేస్త్రీల రెండు మూడు బ్యాచుల వరకు శిక్షణలు ఇచ్చేవారు. తరువాత వ్యవసాయ పరపతి సంఘం ద్వారా మండల స్థాయి రైతులకు విత్తనాలు విక్రయించేందుకు ఒకట్రెండేళ్లు వినియోగించేవారు. ఉపాధి హామీ ద్వారా ఇక్కడే మొక్కలు ఉంచి అవసరమైన రైతులకు పంపిణీ చేసేవారు. తరువాత ఇక్కడ ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించక పోవడంతో గోడౌన్ల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. విషసర్పాలకు ఆవాసాలుగా మారాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

నిరుపయోగంగా పడి ఉన్న మార్కెట్ యార్డు గోడౌన్లు

సంతను నిర్వహించేందుకు..

మార్కెట్ యార్డులోనే నాణ్యమైన సరుకులతోపాటు మార్కెట్ ధర కంటే రూపాయి తక్కువకు విక్రయాలు జరిపేందుకు వీలుగా 2012 అక్టోబర్‌లో అప్పటి కేంద్ర గిరిజన అభివృద్ధి శాఖ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్ సంతను నిర్వహించేందుకు అట్టహాసంగా ప్రారంభించారు. గిరిజనులు పండించే ఉత్పత్తులను ఇక్కడికి తీసుకురావడంతో స్థానిక వ్యాపారులకు బేరాలుండేవి కాదు. దీంతో వ్యాపారులంతా సిండికేట్‌గా మారి గిరిజనుల ఉత్పత్తులను మార్గం మధ్యలో కొనుగోలు చేసి సంతను నిర్వహించకుండా చేశారు. ఇక్కడ సంత జరిగితే మార్కెట్ కమిటీతోపాటు పంచాయతీకి కూడా ఆదాయం వచ్చే అవకాశాలుంటాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని ఇక్కడ సంత నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారు. దళారుల వల్ల ఆ అవకాశం కూడా లేకపోయింది.

మరమ్మతుల కోసం నిధులకు ప్రతిపాదన

ఎఎంసి గోడౌన్ల మరమ్మతులతోపాటు రైతు బజార్ ఏర్పాటు చేసేందుకు రూ.38 లక్షలతో పనులు చేపట్టేందుకు ఏడేళ్ల కిందట మార్కెటింగ్ శాఖ కమిషనర్ ద్వారా నిధులు మంజూరయ్యాయి. రెండు పర్యాయాలు టెండర్లు పిలిచినప్పటికీ పనిచేసేందుకు ఎవరూ ముందుకు రాలేదని అప్పటి మార్కెటింగ్ శాఖ ఎడి బి.శ్రీనివాసరావు తెలిపారు.

ఇదే విషయమై పాలకొండ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కార్యదర్శి స్రవంతి వద్ద 'ప్రజాశక్తి' ప్రస్తావించగా గోడౌన్ల మరమ్మతుల కోసం ప్రతిపాదన చేశామని, నిధులు మంజూరు కాలేదని ఆమె వివరణ ఇచ్చారు.

టిడిపితోనే గిరిజన ప్రాంతాల అభివృద్ధి

పొలిట్‌బ్యూరో సభ్యులు సంధ్యారాణి

ప్రజాశక్తి-పాచిపెంట

టిడిపితోనే గిరిజన ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. మండలంలో బొర్రమామిడి, సతాబి, గొట్టూరు గ్రామాల్లో బుధవారం బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టిడిపి మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వైసిపి పాలనలో గిరిజన గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి, చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటడంతో గిరిజనుల జీవనం కష్టతరంగా మారిందన్నారు. అనంతరం వైసిపి నుండి 50 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వారికి సంధ్యారాణి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ముఖి సూర్యనారాయణ, గూడెపు యుగంధర్, పల్లేడ ఉమా మహేశ్వరరావు, పూసర్ల నర్సింగరావు, దండి మోహనరావు, మాదిరెడ్డి మజ్జిరావు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలో మర్రిపాడు పంచాయతీ పెదబగ్గ గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టిడిపి సీనియర్ నాయకులు పడాల భూదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మినీ మేనిఫెస్టోపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామాలలో తాగునీరు, రహదారుల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బిడ్డిక జయలక్ష్మి, ఎంపిటిసి ప్రతినిధి బిడ్డిక చిలకమ్మ, మాజీ వైస్ సర్పంచ్ ఆరిక మాలయ్య, సీనియర్ నాయకులు సవర మంగయ్య, బిడ్డిక రామకృష్ణ, సవర వెంకటరావు, సవర పెంటయ్య, నిమ్మక బాలరాజు, నిమ్మక గంగయ్య, మహిళలు,యువత పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న వైసిపి సర్కారు.. రైతులనే నట్టేట ముంచే విధంగా వ్యవహరించడం బాధాకరమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయ్‌చంద్ర అన్నారు. రైతులను ఆదుకోలేని ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని సంగంవలసలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులుతో కలిసి ఆయన పాల్గొన్నారు. నీరు లేక ఎండిపోయిన వరి పంటను టిడిపి బృందం పరిశీలించింది. ఈ మేరకు రైతులు టిడిపి బృందం ఎదుట తమ ఆవేదనను వ్యక్తం చేశారు. వర్షాలు కురవక, నీటి ఆధారం లేక తమ పొలాలు ఎండిపోయాయని, ప్రభుత్వం తమను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయ్ చంద్ర మాట్లాడుతూ ఎమ్మెల్యేలు, అధికారులు గ్రామాల్లో పర్యటించి పరిస్థితి అంచనా వేసి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉండగా, బస్సు యాత్రల పేరిట ప్రజలను ఏమార్చేందుకు సమయాన్ని కేటాయిస్తున్నారని ఎద్దేవాచేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొరజాన చంద్రమౌళి, కార్యదర్శి గొరజాన చంద్రమౌళి, అమరాపు రామకృష్ణ, గుంట్రెడ్డి ఉదయ్, మూడడ్ల అప్పలనాయుడు, గంట కృష్ణారావు, పోల సత్యనారాయణ, రెడ్డి సింహాచలంనాయుడు , బుడితి శ్రీరాము, రెడ్డి శివ, వడ్డి చంటి, టిడిపి సీనియర్ నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, బార్నాల సీతారాం తదితరులు పాల్గొన్నారు.

భామిని : వర్షాలు లేక పొలాలు ఎండిపోతున్నాయని టిడిపి నియోజకవర్గ పరిశీలకులు కలమట సాగర్ తెలిపారు. భామినిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణతో కలిసి ఆయన మాట్లాడారు. పంటలు ఎండిపోతున్నా వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసే పరిస్థితి లేదన్నారు. పంటల పరిస్థితిపై స్థానిక ప్రజాప్రతినిధులు సమీక్షించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. భామినిని కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. మండలంలో ప్రధానరహదారి గోతులమయంగా ఉందని, ఆర్‌అండ్‌బి చేయాల్సిన పనిని.. పోలీస్ అధికారులు మట్టితో గోతులు కప్పుతున్నారని చెప్పారు. అనుమతులు లేకుండా చిదిమి రోడ్డుకు ఎలా శంకుస్థాపన చేశారో అర్థం కావడం లేదన్నారు. గిరిజన గ్రామాలలో మౌలిక సదుపాయాలు లేవని గడపగడపకు కార్యక్రమంలో ప్రశ్నిస్తే గొంతు నొక్కే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు రవినాయుడు, ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరావు, నాయకులు బిడ్డికి ప్రసాద్, లోపింటి రాజేష్, సాకేటి రామారావు, గురిబిల్లి లక్ష్మీపతినాయుడు, కోరాడ రాజేష్, క్రిష్ణ చంద్ర దొర పాల్గొన్నారు.

పాచిపెంట.. పార్టీలో చేరిన వారికి టిడిపి కండవాలు కప్పుతున్న పొలిట్‌బ్యూరో సభ్యులు సంధ్యారాణి

సీతంపేట.. గిరిజన గ్రామాల్లో ప్రచారం చేస్తున్న టిడిపి సీనియర్ నాయకులు పడాల భూదేవి

పారామెడికల్, పిహెచ్‌సిపిడబ్ల్యుఎ

జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

కమ్యూనిటీ పారా మెడికల్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం స్థానిక ఎన్‌జిఒ హోంలో జరిగింది. ఎన్నికను రాష్ట్ర అధ్యక్షులు టి.ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి వివిటి రాజు సమక్షంలో నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా నాగిరెడ్డి సింహాచలం, ఉపాధ్యక్షులుగా వానపల్లి శంకరరావు, కార్యదర్శిగా నడిమింటి గోపాలనాయుడు, సహాయ కార్యదర్శిగా బి.వి.రమణ, కోశాధికారిగా తులసీదాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు, వివిధ మండలాల సభ్యులు అభినందనలు తెలియజేశారు.

సిపిఎం, పిహెచ్‌సిపిడబ్ల్యుఎ జిల్లా నూతన కార్యవర్గం

సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలి

ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

ప్రజాశక్తి-కురుపాం, గుమ్మలక్ష్మీపురం

స్థానిక భాషలను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ తెలిపారు. గిరిజన సాంస్కృతిక వారసత్వాన్ని బతికించుటకు స్థానిక భాషలను ప్రోత్సహించాలన్నారు. బుధవారం గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాలలో ఆయన పర్యటించారు. సవరభాషపై గుమ్మలక్ష్మీపురం వైటిసి భవనంలో ఏర్పాటు చేసిన ఓరియంటేషను కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం గర్భిణుల వసతిగృహాన్ని సందర్శించారు. గర్భిణులకు అందిస్తున్న పోషకాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం వారికి పౌష్టికాహారం అందించాలని తెలిపారు. వారికి రక్తహీనత పరీక్షలను నిర్వహించి, అవసరమైన వారికి మందులు సరఫరా చేయాలని తెలిపారు. ఆసుపత్రిలోనే ప్రసవం చేసుకోవాలని సూచించారు.

కురుపాం మండలంలో నారేడుమానుగుడ, జోడుమానుగుడ, సెంటర్‌గుడ, పోరందంగుడ గ్రామాలలో నిర్మిస్తున్న బి.టి.రోడ్డు పనులను పిఒ పరిశీలించారు. మెటీరియల్ క్వాలిటీ పరిశీలించారు. పనులు నాణ్యంగా చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. మొండెంఖల్ గ్రామంలో నిర్మిస్తున్న గిరిజన సంక్షేమ వసతి గృహ నిర్మాణ పనులను పరిశీలించి, సకాలంలో నిర్మాణ పనులను పూర్తిచేయాలని, పనులు నాణ్యంగా ఉండాలని తెలియజేశారు.

మాతృభాషలో శిక్షణ తరగతులు

గుమ్మలక్ష్మీపురం గిరిజన యువ శిక్షణ కేంద్రంలో రెండు రోజులపాటు మాతృభాషలో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. బుధవారం ఈ కార్యక్రమానికి ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి విష్ణు చరణ్ ముఖ్య అతిథిగా హాజరై, శిక్షణను ప్రారంభించారు. ఇందులో భాగంగా మొదటి రోజు సవర భాష ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. సవర భాషలో విద్యాబోధన ఎలా చేపట్టాలో శిక్షణ ఇచ్చారు. డిడి శ్రీనివాసరావు, ఎటిడబ్ల్యుఒ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ

రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

బహుళ పంటలతో లాభాలు

నాబార్డు డిడిఎం టి.నాగార్జున

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

బహుళ పంటలతో రైతులు లాభాలు పొందవచ్చని నాబార్డు డిడిఎం టి.నాగార్జున తెలిపారు. బుధవారం మండలంలోని పెంగవ, రాయగడజమ్ము గ్రామాల్లో జట్టు సంస్థ పర్యవేక్షణలో మాతోట జీవా కార్యక్రమంలో భాగంగా పువ్వల దివాకర్, మండంగి కమల కుమారి అంతర పంటల క్షేత్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ మా తోటలలో పలు పంటలు, అంతర పంటలు వేసుకోవడం వల్ల ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు మొక్కలలో వైవిధ్యం సాధించవచ్చన్నారు. సేంద్రీయ కర్బన శాతం పెరుగుతుందని, నిరంతర పంటతో నిత్యం ఆదాయం రైతులకు లభిస్తుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం వల్ల ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు వస్తాయన్నారు. దీనివల్ల కుటుంబ ఆరోగ్యం బాగుపడటమే కాకుండా ఇతరుల ఆరోగ్యాలు కూడా పరోక్షంగా కాపాడినవారు అవుతారని అన్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద రాయగడజమ్ము, గోరడ , పెంగవ , వల్లాడ గ్రామాల్లో వందమంది రైతులను ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జట్టు వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు, జట్టు ఎగ్జిక్యూటివ్ ట్రస్ట్ ఎస్ ప్రహారాజ్, కన్సల్టెంట్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటలను పరిశీలిస్తున్న నాబార్డు డిడిఎం టి.నాగార్జున

గిరిజనుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - కురుపాం

ఏజెన్సీ ప్రాంతాల్లో ఉండే గిరిజనుల సమస్యలు పరిష్కరించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.సహదేవుడు అన్నారు. సిపిఐ ఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల నుంచి చేపట్టిన పాదయాత్ర బుధవారం కొమరాడ మండలం గుణద వద్ద ముగిసింది. విద్య, వైద్యం, తాగునీరు సక్రమంగా అందక గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడులు ఖండించి, ఐక్యరాజ్యసమితి తీర్మానాలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పి.భాస్కరరావు, జీలకర్ర శుక్రు, నిమ్మక దూచామని తదితరులు పాల్గొన్నారు.

దోమపోటు నివారణపై అవగాహన

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని మాతుమూరులో వరి పొలాలను బుధవారం ఎఒ తిరుపతిరావు పరిశీలించారు. ఈ సందర్భంగా దోమపోటు, కాండం తొలుచు పురుగులను గుర్తించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. అనంతరం పాంచాలిలో విత్తన శుద్ధికి ఉపయోగించే బీజామృతం తయారీని సిఆర్‌పి తిరుపతినాయుడు రైతులకు చూపించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో వివిఎ దినేష్, ప్రకృతి వ్యవసాయ రీజనల్ యాంకర్ యశోదమ్మ, రైతులు పాల్గొన్నారు.

వరిచేను పరిశీలిస్తున్న ఎఒ తిరుపతిరావు

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టం జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో బుధవారం సాయంత్రం రెండు లారీలు ఢీకొన్నాయి. పాలకొండ నుండి పార్వతీపురం వైపు వస్తున్న భారీ కంటైనర్.. ఎదురుగా వస్తున్న లారీని తప్పుడు మార్గంలో వెళ్లి ఢీకొంది. ఈ ఘటనలో ఎవరికి ఏమీ కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు.

ఢీకొన్న లారీలు